# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-04-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాజధాని అమరావతి తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **మచిలీపట్నం పోర్టును సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు.**
3. **ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.**
4. **విశాఖపట్నం, గుంటూరు నగర పాలక సంస్థల మేయర్ పదవులకు ఈరోజు నిర్వహించిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఎన్నికయ్యారు.**
5. **ప్రముఖ సంఘ సంస్కర్త, రచయిత కాళ్ళకూరి నారాయణరావు జయంతి ఈరోజు.**

==========================

అమరావతి రాజధాని పనుల పున:ప్రారంభానికి మే 2న రాష్ట్రానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఎన్డీఏ కూటమి నాయకులతో ముఖ్యమంత్రి ఈ రోజు అమరావతి నుంచి శ్రవణ మాధ్యమం ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే 42 నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడల ఏర్పాటుకు శ్రీకారం చుడతామన్నారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుకోవాలని కూటమి నాయకులకు ముఖ్యమంత్రి సూచించారు.

--------------------------

మచిలీపట్నం పోర్టును సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో పోర్టు నిర్మాణపనులను మంత్రి కొల్లు రవీంద్రతో ఆయన ఈరోజు పరిశీలించారు. అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ, రాజధాని అమరావతికి అతి సమీపంలో కీలకమైన పోర్టు మచిలీపట్నం అని తెలిపారు.. ఇప్పటి వరకు 30 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. మచిలీపట్నం పోర్టుకు భవిష్యత్తులో అన్ని విధాలుగా అభివృద్ధికి అవకాశాలున్నాయని తెలిపారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపడుతుందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో నూతన బస్సులను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నూజివీడు ప్రజలకు బస్సు ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు 19 కొత్త బస్సులను అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. అలాగే విజయవాడ కు నాన్ స్టాప్ బస్సు సర్వీసులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

అమరావతి రాజధానిలోని ఒక ప్రయివేట్ విశ్వవిద్యాలయంలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ప్రారంభించారు. అలాగే అంకుర సంస్థల స్టార్టప్ వి-లాంచ్ పాడ్ 2025ను ప్రారంభించి స్టార్టప్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైయ్యారు.

---------------------------

విశాఖపట్నం, గుంటూరు నగర పాలక సంస్థల మేయర్ పదవులకు ఈ రోజు నిర్వహించిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. విశాఖ మహానగర పాలక మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. విశాఖపట్నం జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ అధ్యక్షతన ఈ ఉదయం నిర్వహించిన జీవీఎంసీ పాలకవర్గ సమావేశంలో మేయర్‌గా కూటమి అభ్యర్థి, టీడీపీ కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఎన్నికైనట్లు సంయుక్త కలెక్టర్ ఆయనకు ధ్రువపత్రం అందజేశారు. అలాగే గుంటూరు నగర పాలక సంస్థలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మేయర్‌గా కూటమి అభ్యర్థి కోవెలమూడి రవీంద్ర ఎన్నికయ్యారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో ఐదు పురపాలక సంఘాలలో మొత్తం తొమ్మిది పదవులకు ఎన్నికలు జరుగుతున్నాయి. కుప్పం, తుని, పాలకొండలో మున్సిపల్ చైర్పర్సన్ పదవులకు, మాచర్ల, తాడిపత్రి, తునిలో వైస్ చైర్పర్సన్ పదవులకు ఎన్నికలు జరుగుతున్నాయి.

---------------------------

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి వాసి మధుసూదన్ రావు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం పది లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేసింది ఈ మేరకు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చెక్కును సంబంధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ....

వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ -ఎన్డీఎస్ఏ ఛైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలో శ్రీశైలం ప్రాజెక్ట్ భద్రతపై విజయవాడలో ఈరోజు కేంద్ర జల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి చెందిన Central Soil & Matirial Research Station -సీఎస్ఎంఆర్ఎస్ నిపుణుల బృందం, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తోంది. ఈ సమావేశంలో శ్రీశైలం ప్రాజెక్టు భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. కాగా రేపు నిపుణుల బృందం ప్రాజెక్టు భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది.

---------------------------

ప్రముఖ సంఘ సంస్కర్త కాళ్ళకూరి నారాయణరావు జయంతి ఈరోజు, "మహాకవి" బిరుదాంకితులైన ఆయన 1871 ఏప్రిల్ 28వ తేదీన అప్పటి పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో జన్మించారు. వరకట్నం దురాచారాన్ని నిరసిస్తూ ఆయన రచించిన 'వరవిక్రయం' నాటకం తెలుగునాట ఎంతో ప్రాచుర్యం పొందింది. జన హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించిన కాళ్ళకూరి నారాయణరావు 1927 జూన్ 27వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని డాక్టర్ అబ్దుల్ కలాం హెల్త్ పార్క్ ,హిందూ శ్మశాన వాటిక పనులను మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించేందుకు అబ్దుల్ కలాం పేరిట హెల్త్ పార్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. పాలకొల్లు పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు ఆహ్లాదంగా గడిపే విధంగా ఈ హెల్త్ పార్కును తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని తిరుపతి శాసనసభ సభ్యులు ఆరణి శ్రీనివాసులు సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకం ద్వారామహిళలకు ఉచిత కుట్టుమిషన్ల శిక్షణా తరగతులను ఆయన ఈరోజు తిరుపతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 30 సెకన్లు....

=====================